




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 206 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | బుధవారం 1 ఏప్రిల్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :206 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | WED 1 APRIL 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!

### ఆసక్తికర వీడియో పంచుకున్న మంత్రి నారా లోకేశ్



- ఏపీ పర్యాటక రంగ ప్రమోషన్‌పై మంత్రి లోకేశ్ దృష్టి
- సోషల్ మీడియా వేదికగా ఆకట్టుకుంటున్న ప్రచార వీడియో
- ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్ అంటూ ఆసక్తికర పోలికలు
- ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాల సంగమం ఏపీ అని ట్వీట్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికరమైన ప్రచార వీడియోను ఆయన పంచుకున్నారు.

- మిగతా2లో

## క్వాంటం అప్లికేషన్లతో ఆంధ్రప్రదేశ్ కే


# తొలి ప్రయోజనాలు

- 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం హార్డ్ వేర్ ఉత్పత్తి లక్ష్యం
- ఏప్రిల్ 14న అమరావతిలో దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ ప్రారంభం
- 2030 నాటికి గ్లోబల్ క్వాంటం హబ్‌గా ఏపీని తీర్చిదిద్దేలా ప్రణాళిక
- క్వాంటం హార్డ్ వేర్ తయారీ ఎకోసిస్టంపై సీఎం చంద్రబాబు కీలక రౌండ్ టేబుల్ సమావేశం




**పెన్ పవర్ డెస్క్:**క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్ల ద్వారా లభించే ప్రయోజనాలను దేశంలోనే తొలిగా అందుకునేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తు సాంకేతికత అయిన క్వాంటం కంప్యూటింగ్‌లో 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్'ను అందిపుచ్చుకోవడం ద్వారా రాష్ట్రానికి అపార అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో 'అమరావతి క్వాంటం వ్యాలీ - క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్' అనే అంశంపై జరిగిన ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న అమరావతి క్వాంటం వ్యాలీ (ఏక్యూవీ), దేశానికే ప్రగతి ప్రేరకంగా నిలుస్తుందని అన్నారు.
ఈ కీలక సమావేశానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీతో పాటు సీడాక్, సీడాట్, డీఆర్‌డీవో, బార్క్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. మూడు దశాబ్దాల క్రితం ఐటీని అందిపుచ్చుకుని హైదరాబాద్‌ను నాలెడ్జ్ ఎకానమీగా మార్చిన స్ఫూర్తితో, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని ఏపీ అభివృద్ధికి చోదకశక్తిగా మలుస్తామని చంద్రబాబు వివరించారు. గతంలో ఐటీ నిపుణుల కోసం ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసినట్లే,

- మిగతా2లో



## ఏపీ రాజధానిగా అమరావతికి

# చట్టబద్ధత...

### నేడు లోక్‌సభలో కీలక బిల్లు


- ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధ హోదా
- బుధవారం నాడు లోక్‌సభలో ఏపీ పునర్‌వ్యవస్థీకరణ సవరణ బిల్లు
- విభజన చట్టంలోని సెక్షన్ 5కు సవరణ చేయనున్న కేంద్రం
- ఇప్పటికే ఏపీ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం
- జూన్ 2, 2024 నుంచి సవరణ అమల్లోకి వచ్చేలా నిబంధన

- మిగతా2లో

## ఏపీలో చేనేతలకు 'పవర్' గిఫ్ట్... నేటి నుంచే!

- చేనేత మగ్గాలకు 200, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్
- ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పథకం అమలు
- లక్షకు పైగా చేనేత కుటుంబాలకు ప్రత్యక్షంగా లబ్ధి
- పథకం కోసం ఏటా రూ.150 కోట్లు వెచ్చించనున్న ప్రభుత్వం
- ఎన్నికల హామీని నెరవేర్చిన ఎన్డీయే ప్రభుత్వం

- మిగతా2లో



## బందరులో ఒక బఫూన్ ఉన్నాడు



- మంగళగిరి టీడీపీ ఆఫీసులో మంత్రి కొల్లు రవీంద్ర మీడియా సమావేశం
- వైసీపీ నేత పేర్ని నానిపై తీవ్ర విమర్శలు
- మడ అడవులు ఆక్రమించి పేర్ని నాని అక్రమంగా చెరువులు తవ్వారన్న ఆరోపణ
- తప్పు చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టబోమని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు వెల్లడి

- మిగతా2లో

### పవన్ కల్యాణ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డుల పంట..

## 24వ స్థానం నుంచి అగ్రస్థానానికి ఏపీ



- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు 5 జాతీయ అవార్డులు
- రెండు విభాగాల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్
- గత ప్రభుత్వ హయాంలో 24వ స్థానం నుంచి మొదటి స్థానానికి ఎగబాకిన ఏపీ
- పల్లెపండుగ, పల్లె వెలుగు వంటి కార్యక్రమాలతో మెరుగైన పనితీరు
- ఈ పురస్కారాలను ప్రకటించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ

- మిగతా2లో

## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

- ప్రపంచ సవాళ్ల మధ్య భారత్ నిలకడగా ఉందని వ్యాఖ్య
- కాంగ్రెస్ వదంతులు వ్యాపింపజేస్తోందని తీవ్ర విమర్శలు
- గుజరాత్‌లోని డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించిన ప్రధాని
- ఈ ప్రాజెక్టు ఆలస్యానికి కాంగ్రెసే కారణమని ఆరోపణ
- దేశ ఐక్యతకు పాటుపడాలని ప్రజలకు పిలుపు



**పెన్ పవర్ డెస్క్:**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, భౌగోళిక రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్-థరాడ్‌లో రూ.19,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, కాంగ్రెస్ వదంతులను ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారని మండిపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. "ప్రపంచంలోని ఎన్నో దేశాలు

- మిగతా2లో

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

### మిత్రదేశాలపై ట్రంప్ ఫైర్



- ఇరాన్‌పై దాడులకు సహకరించని మిత్రదేశాలపై ట్రంప్ ఆగ్రహం
- మీ ఆయిల్‌ను మీరే తెచ్చుకోండి అంటూ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్
- అమెరికా నుంచి కొనుగోలు చేయండి లేదా బలవంతంగా తెచ్చుకోండి అని సూచన
- హర్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో పెరిగిన చమురు ధరలు

- మిగతా2లో

## ఒక్కడు... 27 బైకులు చోరీ చేశాడు!

- ప్రకాశం జిల్లాలో ఘరానా దొంగ అరెస్ట్
- 27 బైకులు చోరీ చేసిన వైనం
- చెడు వ్యసనాల కోసమే దొంగతనాలు చేస్తున్నట్లు వెల్లడి
- నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువైన బైకులు స్వాధీనం
- అరెస్ట్ సమయంలో కిలోకు పైగా గంజాయి కూడా పట్టివేత

- మిగతా2లో



**పెన్ పవర్ డెస్క్:**ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా 27 బైకులను ఒక్కడే చోరీ చేశాడు. చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగగా మారిన ఓ వ్యక్తిని ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 27 మోటార్‌సైకిళ్లను, కిలోకు పైగా

## మా పంటలు ఎండిపోతుంటే అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తారా?

### ఏపీ ప్రభుత్వంపై మంత్రి జూపల్లి ఆగ్రహం

- శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా ఏపీ విద్యుత్ ఉత్పత్తి చేస్తోందన్న జూపల్లి
- ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేస్తోందని ఆవేదన
- రైతుల హక్కులు కాలరాస్తే ఊరుకోబోమని హెచ్చరిక

- మిగతా2లో



## తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

- ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని వెల్లడి
- గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

- మిగతా2లో



## నేటి నుంచి తెలంగాణలో చికెన్ దుకాణాలు బంద్..

- పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచాలని చికెన్ షాపు యజమానుల డిమాండ్
- ఇటీవల గతంలో కంటే మార్జిన్‌లు తగ్గించారని ఆవేదన
- కిలో చికెన్‌పై రూ.30 మార్జిన్ ఇవ్వాలని డిమాండ్

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# వంట గ్యాస్ సిలిండర్ల కొరత తీరేనా?

మారుమూల పల్లెల నుండి మొదలుకొని పేరు మోసిన పట్టణాల్లో సైతం గ్యాస్ సిలిండర్ల వాడకం విరివిరిగా కొనసాగుతుంది. కానీ ఇప్పుడున్న విపత్కర పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల వాడకదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గ్యాస్ వినియోదారుల అవస్థలు అంత పట్టకుండా ఉండే పరిస్థితులు నేడు దాపరించాయి. ప్రస్తుతం ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతుండడమే వంటగ్యాస్ కొరతకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఈ యుద్ధాల వల్ల గ్యాస్ ఉత్పత్తుల్లో, అంతర్జాతీయ సరఫరా ప్రభావితం అవుతుంది. రష్యా , ఉక్రెయిన్, ఇజ్రాయెల్ వంటి దేశాల నుండి ఖఉ, నాచురల్ గ్యాస్, కొద్దిపాటి పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా క్రమంగా తగ్గిపోతుంది. దీనివల్ల విదేశీ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సరఫరా తగ్గుముఖం పట్టడం వల్ల గ్యాస్ సిలిండర్ డిమాండ్‌పై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. భారతదేశంలో ఒఖఉ గ్యాస్ దిగుమతి ఆధారిత వనరుగా ఉంది. తద్వారా కొన్ని దేశాల నుండి ఒఖఉ గ్యాస్ సరఫరా నిలిచిపోయే ఆస్కారం ఉంది. దీనివల్ల ఒఖఉ గ్యాస్ కొరత గణనీయంగా పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం సామాన్య కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకం గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిస్థాయిలో లేక సతమతమవుతున్నారు. వృద్ధులు, నిరాక్షరాస్యులు ఎలా గ్యాస్ బుక్ చేసుకోవడం తెలియని పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. స్థానిక ఒఖఉ డీలర్ల వద్ద నిల్వలు తగ్గడం వల్ల ఫోన్ లేదా ఆన్లైన్ బుకింగ్ ద్వారా గ్యాస్ సిలిండర్లు అందుబాటులోకి రావడం చాలా కష్టంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కనీసం బుక్ కావడం కూడా ఒక సవాలుగా దాపరించింది. టోల్ ఫ్రీ నెంబర్, ఐవిఆర్ఎస్, యాప్, ఇలా ఎన్నో రకాలుగా ఉన్న ప్రత్యామ్నాయాల ద్వారా కూడా ప్రయత్నం చేసినా బుక్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో కొరత అధికంగా ఉంది అనడంలో ఆశ్చర్యం లేదు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో చాలామంది ప్రజలు మళ్ళీ పూర్వ కాలపు విధానాల ఏర్పాట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. వంట చెరుకు, గోబర్ గ్యాస్, విద్యుత్ వాడకపు సాధనాలను వినియోగిస్తూ వంట చేసుకుంటున్నారు. భవిష్యత్తులో ఒఖఉ మార్కెట్‌పై అనూహ్య ప్రభావాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఇలానే యుద్ధం కొనసాగితే ధరలు అనియంత్రితంగా పెరిగే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో డీలర్ల వద్ద స్టాక్ తక్కువ ఉండడం వలన గ్యాస్ సిలిండర్ల ధర విషయంలో చేతివాటం చూపిస్తున్నారు. వాణిజ్య కేంద్రాలైన హోటల్, రెస్టారెంట్లు, హాస్టల్స్ యాజమాన్యాలతో కుమ్మక్కై గ్యాస్ సిలిండర్లను వారికి నచ్చిన ధరలతో సరఫరా చేస్తూ గృహ వినియోగదారులకు మొండి చేయి చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు చాలా చోట్ల జరుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇలాంటి విషయాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాలను పర్యవేక్షిస్తూ స్టాక్ రికార్డులను పరిశీలించాలి. డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాల వద్ద సామాన్య ప్రజలు తమ పనులను వదులుకొని గంటల తరబడి వేచి ఉండి ప్రాధేయపడిన వారికి సరైన సమాధానం చెప్పే నాధుడు కరువయ్యాడు. ప్రభుత్వ అధికారులు వినియోగదారుల పరిస్థితులను వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణ చేయాల్సిన అవసరం ఉంది. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు నెంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

- మొదటి పేజి తరువాయి

అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సమస్యలతో సతమతమవు తున్నాయి. అయితే, మన విజయవంతమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యత వల్ల భారత్ ఈ పరిస్థితులను అదుపులో ఉంచగలిగింది" అని ఆయన వివరించారు. చిన్న దేశాల నుంచి అగ్రరాజ్యాల వరకు ఇంధన ధరలు 10 నుంచి 25 శాతం పెరిగాయని, కానీ భారత్ మాత్రం ఆ భారాన్ని ప్రజలపై పడనీయడం లేదని తెలిపారు. ఈ వాస్తవాలను కాంగ్రెస్ చూడలేకపోతోందని మోదీ విమర్శించారు. "దేశానికి ఐక్యత అవసరమైన ఈ సమయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ ముందుంది. ధైర్యం చెప్పాల్సిన చోట భయాన్ని, వదంతులను వ్యాపింపజేస్తున్నా రు. రాజకీయ రాబందుల్లా దేశంలో గందరగోళం కోసం ఎదురుచూస్తూ, ఎన్నికల లబ్ధి పొందాలని చూస్తున్నారు" అని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇంధన ధరల విషయంలోనూ ప్రజలను క్యూలలో నిలబెట్టి లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌బేస్ అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశ భద్రతకు ఇది చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగిందని గుర్తుచేశారు. "అప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి గుజరాత్‌పై ఎందుకో ద్వేషం. ఏళ్ల తరబడి ఫైళ్లను తొక్కిపెట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు. మీరు నన్ను ఢిల్లీకి పంపిన తర్వాత ఆ ఫైళ్లను బయటకు తీసి, ఈ ఎయిర్‌బేస్‌ను పూర్తి చేశాను" అని మోదీ తెలిపారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ వైఖరే కారణమని, దేశ భద్రత విషయంలో వారి ప్రవర్తనను జాతి ఎప్పటికీ క్షమించదని అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలు భారత్‌ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని మోదీ ఆరోపించారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే శక్తుల మాదిరిగా కాంగ్రెస్ మాట్లాడుతోందని విమర్శించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చూపిన ఐక్యతను ఇప్పుడు కూడా ప్రదర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర గుజరాత్ అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను భారత్ ఎలా ఎదుర్కొంటుందో చెప్పడానికి నిదర్శనమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు తెచ్చే ఈ వీడియో ఇప్పుడు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రచార వీడియోలో ఏపీలోని పలు సుందర ప్రదేశాలను దేశంలోని ఇతర ప్రముఖ పర్యాటక కేంద్రాలతో పోల్చి చూపించారు. "ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్... సిక్కిం కాదు కైలాసగిరి... సుందర్ బన్స్ కాదు కోరింగ... తమిళనాడు కాదు సింహాచలం... గోవాలోని బాగా బీచ్ కాదు రుషికొండ బీచ్... ఇది కేరళ కాదు కోనసీమ... ఇది ఆంధ్రప్రదేశ్" అంటూ సాగే ఈ వీడియో రాష్ట్రంలోని ప్రకృతి రమణీయతను కళ్లకు కడుతోంది. ఈ వీడియోతో పాటు లోకేశ్ ఒక సందేశాన్ని కూడా పోస్ట్ చేశారు. "పవిత్ర ఆలయాల్లోని మంత్రోచ్ఛారణల నుంచి అంతులేని సముద్ర తీరం వరకు, కాలుష్యానికి దూరంగా ఉన్న కొండల అందాల వరకు ఆంధ్రప్రదేశ్ ఆత్మకు ఓ గొప్ప ప్రయాణం లాంటిది. ఇక్కడ ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాలు అన్నీ ఒకేచోట సంగమిస్తాయి. రండి, ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్‌ను అనుభూతి చెందండి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# ఏపీలో చేనేతలకు 'పవర్' గిఫ్ట్... నేటి నుంచే!

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక కానుక అందించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానుంది. దీని కింద చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు (మరమగ్గాలకు) 500 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయనున్నారు. విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించి, సంక్షోభంలో ఉన్న చేనేత వృత్తికి అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,04,488 చేనేత కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. వీరిలో సుమారు 93,000 చేనేత మగ్గాల కుటుంబాలు, 11,488 పవర్‌లూమ్ కుటుంబాలు ఉన్నాయి. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ. 150 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ రాయితీ ద్వారా ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి ఏడాదికి రూ. 8,640 ఆదా కానుండగా, ఒక్కో పవర్‌లూమ్ యూనిట్‌కు ఏటా రూ. 21,600 వరకు ఆర్థిక వెసులుబాటు లభిస్తుంది. ముడిసరుకు, రంగుల అద్దకం, నేత పనులకు విద్యుత్ అత్యవసరం కావడంతో, ఈ ఉచిత సరఫరా వారి ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించనుంది.

ఉచిత విద్యుత్ పథకంతో పాటు, చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం మరిన్ని కీలక చర్యలు చేపట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే నేతన్నలకు ఇచ్చే పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచింది. దీంతో పాటు రూ. 5 కోట్ల విలువైన థ్రిఫ్ట్ ఫండ్ నిధులను సహకార సంఘాలకు విడుదల చేసింది. ఆధునిక యంత్రాల కొనుగోలుపై 90 శాతం రాయితీ, ముడిసరుకులపై 15 శాతం సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలను అందిస్తోంది. చిన్న తరహా క్లస్టర్ల అభివృద్ధికి రూ. 10.44 కోట్లు కేటాయించింది. అంతేకాకుండా, చేనేత ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేర్చేందుకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ వేదికలతో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోంది. తాజాగా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడం ద్వారా చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది.

## ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత...

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకోనుంది. 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) బిల్లు 2026'ను (ఏప్రిల్ 1) బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు ద్వారా 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి సవరణ చేసి, రాష్ట్ర నూతన రాజధానిగా 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చనున్నారు. ఈ బిల్లు ద్వారా పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5, సబ్-సెక్షన్ (2)కు సవరణ చేయనున్నారు. ప్రస్తుతం ఈ సెక్షన్‌లో ఉన్న... 'రాష్ట్రానికి ఒక కొత్త రాజధాని ఉంటుంది' (and there shall be a new capital) అనే వాక్యం స్థానంలో 'అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' (and Amaravati shall be the new capital)... అని చేర్చనున్నారు. అంతేకాకుండా, 'అమరావతి' అనే పదంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఙూజ=ణూ) చట్టం, 2014 ప్రకారం నోటిఫై చేసిన రాజధాని నగర ప్రాంతాలు కూడా కలిసి ఉంటాయని ఈ సవరణలో స్పష్టంగా వివరించనున్నారు. ఈ సవరణ జూన్ 2, 2024 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించనున్నట్లు బిల్లులో పేర్కొనడం గమనార్హం. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని ఏకైక రాజధానిగా నిలబెట్టేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా, మార్చి 28న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5ను సవరించి 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చాలని ఆ తీర్మానంలో కేంద్రాన్ని కోరింది. 2022 మార్చి 3న హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లోని సలహా మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు అసెంబ్లీ తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆమోదించిన ఈ తీర్మానాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు.. రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్, కేంద్ర హోంమంత్రి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఈ బిల్లును తీసుకురానుండడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సవరణ బిల్లుతో ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో నెలకొన్న సందిగ్ధతకు చట్టపరంగా తెరపడుతుందని, అమరావతికి తిరుగులేని చట్టబద్ధ హోదా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

### పవన్ కల్యాణ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డుల పంట..

## 24వ స్థానం నుంచి అగ్రస్థానానికి ఏపీ

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వం వహిస్తున్న ఈ శాఖకు ఏకంగా ఐదు జాతీయ పురస్కారాలు లభించాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, సేవల విస్తరణలో కనబరిచిన అత్యుత్తమ పనితీరుకు గానూ కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది. వివరాల్లోకి వెళితే... రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్, జల్ సంచయ్-జన్ భాగీదారి అనే రెండు కీలక విభాగాల్లో ఏపీ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. మరో విభాగంలో ద్వితీయ స్థానం, ఇంకో రెండు విభాగాల్లో తృతీయ స్థానం దక్కించుకుని మొత్తం ఐదు అవార్డులను కైవసం చేసుకుంది. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని ప్రోత్సహించే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో ఏపీ పనితీరు విశేషంగా మెరుగుపడింది. గత ప్రభుత్వ హయాంలో ఇదే విభాగంలో 24వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ఇప్పుడు దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. అలాగే, తక్కువ ఖర్చుతో వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతులను ప్రోత్సహించే 'జల్ సంచయ్ - జన్ భాగీదారీ' కార్యక్రమంలోనూ ఏపీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణం,

సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సౌకర్యాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 'పల్లెపండుగ 1.0', 'పల్లెపండుగ 2.0' వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.

గ్రామసభలలో వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా 'పల్లెవెలుగు' కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే శాఖ పనితీరు గణనీయంగా మెరుగుపడి, జాతీయ స్థాయిలో ఈ పురస్కారాలు దక్కడం విశేషం.

## బందరులో ఒక బఫూన్ ఉన్నాడు

రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్‌తో పాటు పేర్ని నానిని లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. "బందరులో ఒక బఫూన్ ఉన్నాడు. షాడోలను అడ్డుపెట్టుకుని అక్రమంగా చెరువులు తవ్వించాడు. మడ అడవులను సైతం ఆక్రమించి చెరువులుగా మార్చేశాడు" అని పేర్ని నానిని ఉద్దేశించి కొల్లు రవీంద్ర ఆరోపించారు. అధికారులను బ్లాక్ మెయిల్ చేసి భూములు దోచుకోవడానికి నాని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించవద్దని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు.

### క్వాంటం అప్లికేషన్లతో ఆంధ్రప్రదేశ్ కే

# తొలి ప్రయోజనాలు

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు క్వాంటం నిపుణులను తీర్చిదిద్దేందుకు వైసర్, ఐబీఎం వంటి సంస్థల భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

**'మేడ్ ఇన్ అమరావతి' క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం**

రాబోయే రెండేళ్లలో 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం హార్డ్ వేర్, క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ వంటివాటిని దిగుమతి చేసుకోకుండా, అమరావతి క్వాంటం వ్యాలీలోనే దేశీయంగా ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. 2030 నాటికి ప్రపంచంలోని 5 గ్లోబల్ క్వాంటం హబ్స్‌లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, హార్డ్ వేర్ ఎకోసిస్టంను ఏక్యూవీలో ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌తో పాటు స్టార్టప్‌లు, పరిశోధనలకు అవకాశం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ ప్రణాళికలో భాగంగా, దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్‌ను ఏప్రిల్ 14వ తేదీన అమరావతిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు టెస్టింగ్ కోసం ఈ కంప్యూటర్ అందుబాటులో ఉంటుందని వారు వివరించారు.

క్వాంటం టెక్నాలజీతో అమరావతి భవిష్యత్ నగరంగా, అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా మారుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బృహత్తర లక్ష్య సాధనకు అవసరమైన సాంకేతికత, భాగస్వామ్యం అందించాలని జాతీయ క్వాంటం మిషన్‌ను ఆయన కోరారు.

## తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు, రేపు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి,ం

మెదక్, వికారాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలకు నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హర్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. "అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్‌ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది. ఇక వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినా, ఇరాన్ ఇప్పటికీ హర్మూజ్ జలసంధిపై తన పట్టును కొనసాగిస్తోంది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఇరాన్ దిగ్బంధనం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైంది.

## నేటి నుంచి తెలంగాణలో చికెన్ దుకాణాలు బంద్..

తెలంగాణ రాష్ట్రంలో రేపటి నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పౌల్ట్రీ వాళు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ. 26 మార్జిన్ ఇచ్చేవారని, గత ఇరవై ఏళు గా ఇదే మార్జిన్ ఇస్తున్నారని, ఇటీవల ఈ మార్జిన్ రూ. 16కు తగ్గించారని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. కేజీ చికెన్ మార్జిన్ రూ. 30 ఇవ్వాలని ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అందుకే మార్జిన్ పెంచే వరకు నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. తక్కువ మార్జిన్ వల్ల వ్యాపారుల జీవనోపాధి సవాల్‌గా మారిందని అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు.

### మా పంటలు ఎండిపోతుంటే అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తారా?

శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే మీరు విద్యుత్ ఉత్పత్తి ఎలా చేస్తారని ఏపీ సర్కారును ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జలాశయంలో నీటి మట్టం తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని జూపల్లి గుర్తు చేశారు. "ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారు. నాడు మేము ధర్నా చేసి, హైకోర్టును ఆశ్రయిస్తే కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇప్పుడు మళ్ళీ అదే పంథాను ఏపీ ప్రభుత్వం అనుసరిస్తోంది" అని ఆయన విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని, రైతుల హక్కులను కాలరాస్తే ఊరుకోబోమని జూపల్లి హెచ్చరించారు. "నీటి కేటాయింపులపై స్పష్టమైన జీవోలు ఉన్నాయి. సమాచారం అందలేదని చెప్పడానికి మీరేమైనా చదువురాని వాళ్లా?" అని ఆయన ఏపీ పాలకులను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిందని, ఏపీ కూడా చట్టప్రకారం నడుచుకోవాలని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవడం వల్లే, ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని జూపల్లి ధ్వజమెత్తారు. ఇప్పటికైనా అక్రమంగా నీటిని తరలించడం ఆపకపోతే.. రైతాంగం, ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సమష్టిగా పోరాటం చేసి తమ హక్కులను కాపాడుకుంటామని ఆయన గట్టి వార్నింగ్ ఇచ్చారు. నీటి వాటాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు.

## ఒక్కడు... 27 బైకులు చోరీ చేశాడు!

- మొదటి పేజి తరువాయి

గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళితే, సోమవారం మధ్యాహ్నం ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి మామిడిపాలెం సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన అద్దేటి ఏడుకొండలు (35) అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని ఆపి తనిఖీ చేయగా, దొంగిలించిన బైక్‌తో పాటు 1.175 కిలోల గంజాయి లభించింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజాలు బయటపడ్డాయి. చెడు వ్యసనాలకు డబ్బు అవసరం కావడంతో బైక్ దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నట్లు ఏడుకొండలు అంగీకరించాడు. ఒంగోలు, మద్దిపాడు, అద్దంకి, వినుకొండ, గుంటూరు, నరసరావుపేట, జి.కొండూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 27 బైకులు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అతని సమాచారం మేరకు పోలీసులు ఆయా బైకులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 12 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిపై గతంలోనూ ఒంగోలు, గుంటూరులో పలు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, సీఐ నాగరాజుతో పాటు ప్రత్యేక బృందంలోని సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, పక్కా ప్రణాళికతో నిందితుడిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

# తూర్పులంక పాలకవర్గానికి ఘన సత్కారం



**అల్లవరం,పెన్ పవర్,మార్చి31:**అల్లవరం మండలం తూర్పులంక గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిస్తుండడంతో ఆ గ్రామస్తులు సర్పంచ్ కడలి గంగాచలం ఉప సర్పంచ్ కాశీ కరుణాకర్ పాలకవర్గాన్ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు,శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు మంగళవారం ఘనంగా సత్కరించారు సర్పంచ్ గంగా చలం మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో సంతృప్తికరమైన పాత్రపోషించామన్నారు.గ్రామాభివృద్ధికి తోడ్పడిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ కార్యదర్శి చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు గ్రామస్తులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# మాదకద్రవ్య రహిత జిల్లాగా రూపొం దించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 31:** దేశ భవిష్యత్తును తీర్చిది ద్దాల్సిన యువత మాదక ద్రవ్యాల వ్యసనాల బారిన పడి తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసు కోవద్దని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వ హించి తీసుకోవలసిన చర్యల పట్ల వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ కోనసీమ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా రూపొం దించేం దుకు సమాజంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం వహించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలు జోలికి వెళ్ళితే భవిష్యత్తు అంధకారమ వుతుందనే సందేశాన్ని యువతకు విస్తృత స్థాయిలో చేర్చాలన్నారు. యువతలో అవగాహన కలిగించి, యువత మాదక ద్రవ్యాలు జోలికి పోకుండా చూడవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పిల్లలు డ్రగ్స్ మత్తు పదార్థాలు అలవాటు కాకుండా గట్టిగా దృష్టి పెట్టాలన్నారు. మన పిల్లల ప్రవర్తన ఎలా ఉంటుందని, నడవడిక ఏ విధంగా ఉంద నే విషయాలు ఎప్పటి కప్పుడు పరిశీలించుకుని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం దిశగా యువతీ యువకులకు నేటి సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు ఇది ఒక వ్యక్తికి మాత్రమే పరిమితం కాకుండా, కుటుంబాలను మొత్తం సామాజిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ఒక పెను సవాలుగా ఉందన్నారు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన యువత ఈ వ్యసనాల బారినపడి తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు

ఈ మహమ్మారిని నిరోధించే క్రమంలో జిల్లా యంత్రాంగం అవగాహన మరియు చైతన్యం విద్యాసంస్థల్లో నిఘా పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో మాదక ద్రవ్యాల అమ్మకాలను అరికట్టడానికి పోలీసు ఎక్సైజ్ శాఖల ద్వారా కఠినచర్యలు తీసుకోవాలన్నారు

ప్రతి విద్యాసంస్థలో యాంటీ డ్రగ్ క్లబ్స్ ఏర్పాటు చేసి, విద్యార్థుల ద్వారానే తోటి వారిలో చైతన్యం కల్పించే కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. నిఘా, నియంత్రణ మాదక ద్రవ్యాల రవాణా, నిల్వ మరియు విక్రయా లకు పాల్పడే వారిపై చట్టం కింద చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్ స్పాట్లో వద్ద సౌరశక్తి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ప్రవేశించే వాహనాలలో తనిఖీలు నిర్వహించి గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టాలన్నారు. పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే లేదా డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా జిల్లా హెల్ప్ లైన్ నంబర్‌కు సమాచారం అందించాల న్నారు. వ్యసనానికి గురైన వారిని నేరస్థులుగా చూడ కుండా, బాధితులుగా గుర్తించి వారిని మార్చడానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ కొరకు పునరా వాస కేంద్రాలు పనిచేస్తున్నా యన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రసంగిస్తూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ, వారితో స్నేహ పూర్వకంగా ఉంటూ మానసిక ధైర్యాన్ని అందించాలన్నారు. క్షణికానందం కోసం డ్రగ్స్ వైపు వెళ్లడం అంటే మృత్యువు ను ఆహ్వానించడమేనన్నారు కష్టపడి చదవండి, క్రీడల్లో రాణించండి మరియు సృజనాత్మక పనుల్లో నిమగ్నం అవ్వండి. మీ కలలే మీ గమ్యం కావాలి తప్ప, వ్యసనాలు కాదన్నారు. మనమందరం కలిసికట్టు గా పోరాడి, మన జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు



మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్ధాలను డిగ్రీ మారక ద్రవ్యాలు రవాణా చేసిన విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నతమైన లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఓటీపీలు, లింక్స్, లోన్ యాప్లు, ఆన్లైన్ గేమ్స్, బెట్టింగులు, ద్వారా సెల్లర్ నేరాలు, చదువుకో వలసిన వయసులోప్రేమ పేరుతో ఫోక్స్ చట్టం అతిక్రమించి నేరాలకు యువత బలవుతున్నారని, వీటి పట్ల అప్రమ త్తంగా ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన కల్పించారన్నారు చట్టాలపై అవగాహన పెంచుకొని సన్మార్గంలో నడిచినప్పుడు మాత్రమే నేటి యువత భవిష్యత్తులో మంచి పౌరులుగా వెలుగొందు తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మమ్మీ భాగ్యవతి డిపిఓ శాంత లక్ష్మి ఆర్డీవో డి శ్రీనివాసరావు డి సి హెచ్ ఎస్ కార్తీక్ డిఎం అండ్ హెచ్ ఓ దుర్గారావు దొర ఆర్టీసీ జనరల్ మేనేజర్ డిఎల్ఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు

# ఇష్టారాజ్యం...

- కాంట్రాక్టర్ ఆగడాలతో.. రోగుల ఇక్కట్లు
- పది రోజులుగా పేషెంట్లకు భోజనాలు లేక విలవిల
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆహారం అందని వైనం
- గ్యాస్ లేదని షాక్ చెబుతున్న కాంట్రాక్టర్




**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 31:**రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట అని చెబుతుంటే అధికారులు నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్లు ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే 30 పడకలతో ఉన్న జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇటీవల గండేపల్లి మండలం జెడ్ రాగంపేట ప్రాంతంలో నిర్మించిన నూతన భవనంలోకి వచ్చింది. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పేద, నిరుపేద, బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో అత్యాధునిక పరికరాలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు ఇవ్వడం గమనార్హం. దానితోపాటు వైద్యం చేసించుకునే రోగులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, సాయంకాలం భోజనం ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం అందించేందుకు నిర్ణయం . అది కాస్త కాంట్రాక్టర్ల ఇస్తారాజ్యంతో నీరుగారుతోందని చెప్పక తప్పదు. జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు గండేపల్లి, జగ్గంపేట, గోకవరం తదితర ప్రాంతాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాలైన రంపచోడవరం తదితర ప్రాంతాల నుండి వైద్యం నిమిత్తం రోగులు వస్తుంటారు. ఆ రోగులకు ఉచిత వైద్య సేవలతో పాటు మందులు పంపిణీ చేసి రోగులకు ఉదయం అల్పాహారం నుండి సాయంకాలం భోజనం వరకు అందు ఇవ్వాల్సిన బాధ్యత ఆసుపత్రి అధికారులకు ఉంది. దీని నిమిత్తం ఒక కాంట్రాక్టర్ ని ఏర్పాటు చేసి భోజనాలు అందించడం జరుగుతుంది. రోగులతో పాటు కూడా వచ్చే వ్యక్తులకు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ , తనయుడు జ్యోతుల నవీన్ కుమార్ జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా భోజనాలు అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా ప్రభుత్వం ద్వారా రోగులకు అందించే భోజనాలను పది రోజులుగా కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరితో అందివ్వకపోవడం పట్ల రోగులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఆసుపత్రికి సుమారుగా నిత్యం ఓపి సుమారు 200 నుండి 300 వరకు ఉంటుంది. ఆసుపత్రిలో ఉండే గర్భిణీ స్త్రీలు, సర్జన్ పేషెంట్లు సుమారుగా 15 మంది ఉంటున్నారు . వీరికి డైలీ అల్పాహారం తో పాటు, భోజనం అందించవలసిన అవసరం ఉంది రోగులకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా టిఫిన్, మరియు భోజనాలను నాణ్యత పరిశీలించి తదనంతరం రోగులకు బాధ్యత గా అందవలసిన బాధ్యత హెడ్ నర్స్ పై ఉంది. అయితే ఈ తంతు ఈ కొత్త సంవత్సరం నుండి కానరావడం లేదని రోగులు వాపోతున్నారు.



ఈనెల 19వ తేదీ ఉగాది నుండి ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఉచిత టిఫిన్, భోజనాలను అందడం లేదని చెబుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఆహారం అదే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దీనిపై సిహెచ్ సి హెడ్ నర్స్ లక్ష్మి ని వివరణ కోరగా గత 19వ తేదీ నుండి రోగులకు కాంట్రాక్టర్ ఎటువంటి ఆహారాన్ని అందడం లేదని ఎన్నిసార్లు కాంట్రాక్టర్ తెలియపరిచిన ఉపయోగం ఉండడం ఉండడం లేదని చెబుతున్నారు . గ్యాస్ కొరతతో రోగులకు ఆహారాన్ని ఇవ్వలేక పోతున్నామని కాంట్రాక్టర్ చెబుతున్నారని హెడ్ నర్స్ లక్ష్మి తెలిపారు. ఈ సమస్యపై ఫోను ఎన్నిసార్లు చేసినా కాంట్రాక్టర్ ఎత్తడం లేదని తెలిపారు. సమస్యపై లిఖితపూర్వకంగా ఇవ్వవలసిందిగా కాంట్రాక్టర్ను కోరినట్లు ఆమె తెలిపారు.

# లంపకలోవ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు.



- పలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.
- ప్రత్తిపాడు ఎస్సై, ఎస్ లక్ష్మీకాంతం.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, మార్చి 31:**ప్రత్తిపాడు మండలం లంపకలోవ హై స్కూల్లో ప్రత్తిపాడు ఎస్సై, ఎస్ లక్ష్మీకాంతం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సైబర్ నేరాలు,డ్రగ్స్ వినియోగం, మహిళల భద్రత,అసాంఘిక కార్యకలాపాలు,గుడ్ టచ్,బ్యాడ్ టచ్ వంటి ముఖ్యమైన అంశాలపై విద్యార్థినీ,విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులతో సంప్రదింపులు చేయకుండా ఉండాలని సూచించారు.ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలని అవగాహన కల్పించారు.అలాగే 10 వ తరగతి పరీక్షల నిర్వహణ నేపథ్యంలో పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.పరీక్షల సమయంలో భద్రతా ఏర్పాట్లు,సీసీ కెమెరాల వినియోగం,బయటి వ్యక్తుల ప్రవేశంపై నియంత్రణ వంటి అంశాలపై చర్చించారు.ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని ఎస్సై లక్ష్మీకాంతం తెలియచేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రాష్ట్ర గవర్నర్ పర్యటనకు సమగ్ర ఏర్పాట్లు చేయాలి- జేసీ అపూర్వ భరత్



**కాకినాడ, పెన్ పవర్, మార్చి 31:**రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఏప్రిల్ 2న కాకినాడ పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు.మంగళ వారం మధ్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి గవర్నర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ,గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ కాకినాడ 12వ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏప్రిల్ 2న కాకినాడకు రానున్నట్లు తెలిపారు.ఆయన ఉదయం 10:45 గంటలకు హెలికాప్టర్ ద్వారా విజయవాడ నుంచి కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుని, అక్కడి నుంచి 11 గంటలకు జేఎన్టీయూ అలుమ్నీ హాల్‌కు చేరుకుంటారని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:20 గంటల వరకు జేఎన్టీయూ- కాకినాడ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం 12:30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి పోలవరం ప్రాజెక్ట్ సందర్శనకు వెళతారని వివరించారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో హెలిప్యాడ్ సిద్ధం చేయాలని, రూట్ బారికేడింగ్ చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. కాన్వాయ్, రూట్ క్లియరెన్స్, గార్డ్ ఆఫ్ ఆనర్ ఏర్పాట్లు పోలీస్ శాఖ చేపట్టాలని ఆదేశించారు. స్నాతకోత్సవ కార్యక్రమం నిరాఘాటంగా జరిగేందుకు విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని, అత్యవసర వైద్య సేవలను వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం చేయాలని, రవాణా శాఖ వాహనాల ఏర్పాట్లు చేయాలని, ఆహార ఏర్పాట్లను ఫుడ్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. మీడియా, పబ్లిక్ అడ్రస్ ఏర్పాట్లను సమాచార శాఖ, పారిశుధ్యం మరియు త్రాగునీటి ఏర్పాట్లను కాకినాడ మున్సిపల్ అధికారులు చేపట్టాలని పేర్కొన్నారు.అన్ని శాఖలు సమన్వయంతో ప్రోటోకాల్ ప్రకారం గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని జేసీ అపూర్వ భరత్ కోరారు.ఈ సమావేశంలో డీఆర్ఓ డి. తిప్పే నాయక్, ఎఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, ఎస్బీ డీఎస్పీ కె. సత్యన్నారాయణ, కాకినాడ మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యన్నారాయణ, డీఎంహెచ్ఓ డా. జె. నరసింహ నాయక్, ఆర్ అండ్ బి ఎస్ఈ జి. కాంతు, ట్రాన్స్‌కో ఎస్ఈ జి. ప్రసాద్, సమాచార శాఖ డీడీ పి. తిమ్మప్ప, జేఎన్టీయూకే లైజన్ అధికారులు పాల్గొన్నారు.



## మానవత్వాన్ని చాటుకున్న సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 31:**సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు తమ మానవత్వాన్ని చాటుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎస్ కె ఓల్డ్ ఏజ్ హోమ్‌ను సందర్శించి అక్కడి వృద్ధులకు అవసరమైన నిత్యావసర సరుకులు, పండ్లు అందించారు. అదేవిధంగా సమీపంలోని మనో వికాస కేంద్రాన్ని కూడా సందర్శించి అక్కడ ఉన్న అనాథ పిల్లలకు పండ్లు, అవసరమైన సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సేవాభావాన్ని ప్రదర్శిస్తూ సమాజంపై తమ బాధ్యతను తెలియజేశారు.

ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ తల్లిదండ్రులను సక్రమంగా చూసుకోవాలని, అలాగే అవసరంలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందించడం మన కర్తవ్యమని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లియాకత్ అహ్మద్ , ఉపాధ్యాయులు వినయ్ పాల్, రజిని మేడం, మహాలక్ష్మి, భారతి, కామాక్షి, భువనేశ్వరి పాల్గొన్నారు. అలాగే స్కూల్ అడ్మినిస్ట్రేటర్ రవణం ప్రణవి ప్రియా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

ఈ సేవా కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సమాజ సేవలో తమ వంతు పాత్ర పోషించారు. ఈ చిన్నతనంలోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అని కొనియాడినటువంటి ఓల్డ్ ఏజ్ హోం యాజమాన్యం అదేవిధంగా మనోవికాస కేంద్రం నిర్వహకులు చిన్నతనం నుంచి ఇలాంటి కార్యక్రమాలను చేపిస్తున్నటువంటి సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

## సన్ రైజ్ ఆసుపత్రిలో అనస్థీషియా టెక్నాలజిస్ట్స్ దినోత్సవం




**కాకినాడ, పెన్ పవర్, మార్చి 31:**కాకినాడ సన్ రైజ్ ఆసుపత్రిలో అనస్థీషియా టెక్నాలజిస్ట్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ సర్జన్ డా. బొండా సూర్యరావు, దంత వైద్య నిపుణులు డా. అడ్డాల సత్యనారాయణ, అత్యవసర చికిత్స నిపుణులు డా. గోకవరపు స్వామి ఆధ్వర్యంలో అనస్థీషియా టెక్నిషియన్స్ సురేష్, లావణ్యలను సన్మానించారు.ఈ సందర్భంగా డా. బొండా సూర్యరావు మాట్లాడుతూ, "ఆపరేషన్ థియేటర్లలో రోగుల భద్రత, శస్త్రచికిత్సల విజయవంతంలో అనస్థీషియా టెక్నాలజిస్టులు కీలక పాత్ర పోషిస్తారు. వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం" అన్నారు. అనస్థీషియా పరికరాల నిర్వహణ, శస్త్రచికిత్సకు ముందు యంత్రాల సిద్ధం, రోగుల ప్రాణ సంకేతాల పర్యవేక్షణలో వారు ముఖ్య బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపారు.డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, "శస్త్రచికిత్స సమయంలో రోగికి నొప్పి తెలియకుండా చూసే అనస్థీషియా టెక్నాలజిస్టులు ప్రాణరక్షకులుగా పనిచేస్తున్నారు. శస్త్రచికిత్సల విజయానికి వెనుక ఉన్న అదృశ్య శక్తులు వారే" అని కొనియాడారు.అనంతరం డా. గోకవరపు స్వామి ఆధ్వర్యంలో రోగుల భద్రత, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సన్ రైజ్ ఆసుపత్రి సిబ్బంది క్రాంతి, రేబాక, పవన్, భ్రమరాంబ,మంజు, మాధవి, రాయుడు కృప,ఝాన్సీ,సురేష్ కొల్లి తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలల ఆధ్వర్యంలో పాలిసెట్ కు ఉచిత శిక్షణ



**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 31:** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గల ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలల ఆధ్వర్యంలో రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ నిర్వహించే పాలిసెట్ 2026 ప్రవేశ పరీక్షకు హాజరు అయ్యే విద్యార్థుల కొరకు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఆన్లైన్ మాధ్యమంలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ మరియు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేయి మందికి పైగా విద్యార్థులు ఇంటి వద్ద నుంచే ఈ శిక్షణా తరగతులకు హాజరు కావడానికి ఇప్పటికే రిజిస్టర్ అయ్యారని తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు ఆదిత్య పాలిటెక్నిక్ వెబ్ సైట్ కు లాగిన్ అయ్యి రిజిస్టర్ అవ్వవచ్చున్నారు. ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ టి వి ఎస్ కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 25న జరిగే పాలిసెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏప్రిల్ 4వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పిఠాపురం,పెద్దాపురం, కాకినాడ, మామిడాడ లోని ఆదిత్య విద్యాసంస్థలలో ఆన్లైన్ అప్లికేషన్ కోసం సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పూర్తి వివరాలకు 8498053404, 9505518249, 9505518255 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## రైతుల మేలుకోసం మార్కెట్ కమిటీలు కృషి చేయాలి: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**రావులపాలెం పెన్ పవర్ మార్చి 31:** రైతులకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం మార్కెట్ కమిటీలు కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు.

మంగళవారం కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.ముందుగా రావులపాలెంలోని పార్టీ కార్యాలయం నుంచి కూటమి నాయకులతో కలిసి ర్యాలి గా బయలుదేరి, అక్కడ ఉన్న కళా వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎం.కె.ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ల నాయకత్వంలో కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందిస్తోందన్నారు. ప్రజలు ఇచ్చిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు.

సమర్థవంతమైన నాయకులకు మార్కెట్ కమిటీల్లో అవకాశం కల్పించడంశుభపరిణామమన్నారు.

కొత్తపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన పల్లి మంగాదేవి, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కంఠంశెట్టి శ్రీనివాసరావును అభినందించారు.వ్యవసాయ రంగ అభివృద్ధికి సేంద్రీయ వ్యవసాయం, బిందు సేద్యం, గిట్టుబాటు ధరలు, ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

రావులపాలెం మార్కెట్ యార్డు నిర్మాణం తన హయాంలోనే జరిగిందని గుర్తుచేశారు. అరటి, కొబ్బరి పంటల ఉప ఉత్పత్తులపై దృష్టి సారిస్తూ ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. దేవరపల్లిలో బనానా ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటుకు భూమి కేటాయించినట్లు వెల్లడించారు.రైతుల సంక్షేమం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, బీసీ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



## ఏఎంసీ డైరెక్టర్ గూడెల్ల దుర్గనాగేంద్ర కు ఘన సత్కారం





గౌడ సంఘ సభ్యులు ఇతర నాయకులు

**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 31:**కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్‌గా నియమితులైన గూడెల్ల దుర్గ నాగేంద్రను మంగళవారం ఆమె స్వగృహమైన ర్యాలి గ్రామంలో గౌడ్ సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గౌడ ఈ సంఘ నాయకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై ఆమెకు పూలమాలలు వేసి దుస్సాలతో సన్మానించారు. డైరెక్టర్‌గా నియమితులవడం గ్రామానికి గర్వకారణమని, ఆమె తన పదవిలో రైతులకు, స్థానిక ప్రజలకు మేలు చేసేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా గూడెల్ల దుర్గ నాగేంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్ యార్డుల అభివృద్ధి, రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకోవడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు పెండెం వెంకన్న , వంకా రామకృష్ణ గౌడ, తీగ రెడ్డి మహేష్ గౌడ (మండపేట బీసీ సంఘం కార్యదర్శి), మార్గాన్ని శ్రీనివాస్ ర్యాలి గ్రామ కస్టర్ ఇంచార్జ్ కందుల రాంబాబు , గౌడ సంఘ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జిల్లాలో 16.49 లక్షల ఓటర్ల నమోదు: డీఆర్వో తిప్పే నాయక్



**కాకినాడ, పెన్ పవర్,మార్చి 31:**కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. టి. తిప్పే నాయక్ కీలక వివరాలు వెల్లడించారు. జిల్లాలో నేటి వరకు మొత్తం 16,49,181 మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు.ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితా నిర్వహణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, కొత్త పోలింగ్ స్టేషన్ల ప్రతిపాదనలు, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని డీఆర్వో కోరారు.జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1640 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో ఇప్పటివరకు 16,49,181 మంది ఓటర్లు నమోదయ్యారని ఆయన తెలిపారు. 2026 జనవరి 1 నుంచి మార్చి 30 వరకు ఫారం-6, 7, 8లకు సంబంధించి మొత్తం 1219 దరఖాస్తులు అందాయని, వాటిని నిర్దిష్ట గడువులోపు పరిష్కరించనున్నట్లు చెప్పారు.ఓటర్ల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నామని,అనువుకాని కేంద్రాలను సరైన భవనాలకు మార్చే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 1640 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 185 కొత్త కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1150 మంది ఓటర్లను పరిగణలోకి తీసుకుని ఈ ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు.త్వరలో జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభం కానుందని, ఈ ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్లను తప్పనిసరిగా నియమించాలని సూచించారు. ఇందుకు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన బిఎల్ ఏ-2 ఫారమ్‌లో వివరాలు సమర్పించాలని చెప్పారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గదుల సాయిబాబా (టిడిపి), రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్ సీపీ), అడబాల సత్యనారాయణ (జనసేన), చోడిశెట్టి రమేష్ బాబు (భాజపా), సబ్బారపు అప్పారావు (బిఎస్పి), పోలిశెట్టి శ్రీనివాసు (ఐఎన్‌సీ), కరణం ప్రసాదరావు (సీపీఎం), కె. కృష్ణమోహన్ (ఆప్) పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్ ఏవో ఎస్. రామ్మోహన్ రావు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం. జగన్నాధం తదితరులు హాజరయ్యారు.


# తూర్పులంక పాలకవర్గానికి ఘన సత్కారం



**అల్లవరం,పెన్ పవర్,మార్చి31:**అల్లవరం మండలం తూర్పులంక గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిస్తుండడంతో ఆ గ్రామస్తులు సర్పంచ్ కడలి గంగాచలం ఉప సర్పంచ్ కాశీ కరుణాకర్ పాలకవర్గాన్ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు,శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు మంగళవారం ఘనంగా సత్కరించారు సర్పంచ్ గంగా చలం మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో సంతృప్తికరమైన పాత్రపోషిం చామన్నారు.గ్రామాభివృద్ధికి తోడ్పడిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ కార్యదర్శి చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు గ్రామస్తులు సచివాలయ సిబ్బంది వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.


# ఆత్రేయపురం మండల సర్వసభ్య సమావేశం








## మండలంలో ఉన్న సర్పంచులకు ఘన సన్మానం

**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 31:**ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళ వారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించబడింది. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులుబోణం సాయిబాబా, ఎంపీటీసీ సభ్యులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు మండల స్థాయి అధికారులుహాజరయ్యారు.సమావేశంలో ముందుగా పేద కుటుంబాలకు అండగా నిలవడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన 'మార్గదర్శుల' సేవలను ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అభినందించారు.తదుపరి గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతి తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించబడింది. ప్రతి శాఖ అధికారి తమ తమ విభాగాల పనితీరును వివరించారు.అనంతరం గ్రామ సర్పంచుల పదవీకాలం ముగియనున్న సందర్భంగా, తమ పదవీకాలంలో గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సర్పంచులను గుర్తిస్తూ ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యులు బోణం సాయిబాబా, ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్, తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామస్వరూప్ ,
మండల స్థాయి అధికారులు పంచాయితీ కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.




## అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి





**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 31:**అందరి సహకారంతో మాచవరం గ్రామాభివృద్ధికి కృషి చేయడం జరిగిందని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం లో పాలకవర్గం చివరి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతకుమారి మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పోటి చేసి అన్నవర్గాల వారి సహకారంతో విజయం సాధించానని అన్నారు. అప్పటి నుండి గ్రామాభివృద్ధికి అహర్నిశలు శ్రమించి అభివృద్ధి చేయాడం జరిగిందన్నారు. అభివృద్ధి లో పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సహకారం మరువలేనిదన్నారు. గ్రామంలో ప్రభుత్వ సహకారంతో రహదారులు, తాగునీరు అభివృద్ధి చేసామన్నారు. కొంతమేర మురుగు కాలవలను నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ఎస్సీ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి ప్రభుత్వం నుండి ఎమ్మెల్యే సహకారంతో నిధులు మంజూరు చేయించి భూమి పూజ కార్యక్రమం నిర్వహించామన్నారు. అయిదేళ్ళ పాలనలో గ్రామాభివృద్ధి కి కూటమి నాయకులు, గ్రామ పెద్దల సహకారం పాలకవర్గ సభ్యులు తో కలి మాచవరం గ్రామ పంచాయతీ ని అభివృద్ధి పథంలో నిలిపామని అన్నారు. ఈ సందర్భంగా వారి సహకారం మరువలేనిదన్నారు. పాలకవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం సర్పంచ్ శాంతకుమారి సుబ్బారావు లను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలత సిబ్బంది పాల్గొన్నారు.

## ర్యాలిలో జగన్మోహిని కేశవ స్వామి కళ్యాణోత్సవాలు

### నాలుగవ రోజు స్వామివారి సదస్యం (మహాదాశీర్వచనం)






**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 31**: కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం మండలం, ర్యాలి గ్రామంలో ఉన్న శ్రీ జగన్మోహిని కేశవ స్వామి దేవస్థానం లో మంగళవారం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగానిర్వహించబడనున్నాయి ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు, ఖండవల్లి సీతారామాచార్యులు వేద పండితులు వెంకట అవధాని స్వామివారి కి ఉదయంఅభిషేకం, తులసిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, నిత్య ఉపాసన, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పాలతో పాటు వేదపారాయణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారి పూజా కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి బి వెంకటరమణమూర్తి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం పాల్గొన్నారు. సదస్యం (మహాదాశీర్వచనం) అనంతరం భక్తులకు ప్రసాదాల పంపిణీ జరగనుంది.తదుపరి సాంస్కృతిక కార్యక్రమాల భాగంగా శ్రీ సత్య శ్రావణి నృత్యనికేతన్, రాజమహేంద్రవరం వారిచే భరతనాట్య నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు.
ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అసిస్టెంట్ అధికారులు వై.శ్రీనివాస్ ,దత్తు,పాల్గొననున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపను పొందాలని ఆలయ అధికారులు కోరారు.

## ఘనంగా జగ్గంపేట డివిజన్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ చిహ్నం టవర్ ప్రారంభోత్సవం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 31:** జగ్గంపేట డివిజన్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జగ్గంపేట కరెంట్ ఆఫీస్ వద్ద నిర్మించిన యూనియన్ టవర్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిస్కం ప్రధాన కార్యదర్శి వి.ఎస్.ఆర్ కె గణపతి, డిస్కం అధ్యక్షులు ప్రాంతీయ కార్యదర్శి వివిఎస్ నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టవర్ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన గణపతి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు కోసం నిరంతరం పోరాడుతూ ఉంటామని ప్రధాన సమస్య అయిన జేఎల్ఎం గ్రేడ్ 2 రెగ్యులర్ విషయంలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారందరినీ శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ సమావేశంలో యూనియన్ డివిజన్ అధ్యక్షులు పి.శ్రీనివాసరాజు, డివిజన్ కార్యదర్శి ఎస్.మురళి కృష్ణ, ప్రాంతీయ అధ్యక్షులు ఎం.వి రమణ, ఆర్ రాంబాబు, పిఎస్ నారాయణ, డి.రాజశేఖర్, పి.సత్యనారాయణ , నాగేంద్ర, వీరేంద్ర, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 31:** జగ్గంపేట టౌన్ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి రమేష్ జనసేన నాయకులతో కలిసి పాల్గొని పేదలకు స్వయంగా అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ఆదర్శంగా తీసుకుని డొక్కా సీతమ్మ క్యాంటీన్ పేరుతో గత రెండు సంవత్సరాలుగా నిరుపేదలకు భోజనం అందిస్తున్నానని తెలిపారు. పేదవారి ఆకలి తీర్చడంలో లభించే ఆనందం ఏ ఇతర పనిలో లేదని పేర్కొన్నారు. జనసేన నాయకులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో తుమ్మలపల్లి రమేష్ తన సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం నిరంతరం ఈ క్యాంటీన్ నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సావనీరు ఆవిష్కరించిన అరుణోదయకి జేజేలు




**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 31:** భూమి-భుక్తి-విముక్తి పోరాటాలలో తన ఆట-పాట సాహిత్యంతో ప్రజలను చైతన్యం చేయడంలో కీలక కృషి చేస్తున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాలు పూర్తిచేసుకుని సావనీరు విడుదల చేసుకున్న సందర్భంగా మంగళవారం జగ్గంపేట మండలం రామవరం గ్రామపంచాయతీ రంగవల్లి నగర్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అరుణోదయ కి జేజేలు పలకడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు అరుణోదయ సాంస్కృతిక సామాఖ్య సావనీరు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రైతు-కూలీల కోసం, మహిళల కోసం, విద్యార్థుల కోసం, కార్మికుల కోసం, వారి హక్కుల కోసం జరుగుతున్న పోరాటంలో అరుణోదయ కీలక పాత్ర పోషించిందని, పోషిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజుబాబు, ఏ ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి కుంచె అంజిబాబు, పిఓడబ్ల్యూ స్త్రీ విముక్తి జిల్లా నాయకురాలు రెడ్డి దుర్గాదేవి, పి డి యస్ యు విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, రంగవల్లి నగర్ నాయకులు డాన్ శ్రీను, సత్తిబాబు, నూకరాజు, రంగవల్లి నగర్ ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న టిడిపి నాయకులు



**వైసీపీ నాయకులు, గ్రామ సర్పంచ్ తనయుడు మలిరెడ్డి పాపారావు**



**గండేపల్లి, పెన్ పవర్, మార్చ్, 31:** గండేపల్లి మండలం పి.నాయకంపల్లిలో గ్రామ అభివృద్ధి పనులను గ్రామ టిడిపి నాయకులు అడ్డుకున్నారంటూ గ్రామ సర్పంచ్ తనయుడు , వైసీపీ యువ నాయకులు మలిరెడ్డి పాపారావు ఆగ్రహం వ్యక్తం చేశార . ఈ సందర్భంగా మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీలు నిర్మాణానికి అర్ డబ్ల్యు ఎస్ ద్వారా పనులు చేసేందుకు రూ. 12 లక్షలతో అంచనాలు వేయడం జరిగిందన్నారు . ఆ పనులకు గాను ఎంపిపి చలగల్ల దొరబాబు మండల పరిషత్ నిధులను రూ. 4 లక్షలు విడుదల చేశారన్నారు. మిగిలినవి మరో రెండు నెలల్లో ఇస్తానని హామీ ఇచ్చారు అన్నారు. అలాగే ఎంపీపీ దొరబాబు ఇచ్చిన రూ 4 లక్షల రూపాయలతో పనులు మొదలు పెడితే వాటిని స్థానిక టిడిపి నాయకులు అడ్డుకున్నారని ఆపేతను వ్యక్తం చేశారు . . గ్రామ ప్రజలకు ఉపయోగపడే పనులను సైతం నిలిపివేయడం ఎంత వరకు సబబు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు . కేవలం రాజకీయ దురుద్దేశ్యంతో ఇలా చేస్తున్నారని విషయాన్ని వాపోయారు. ఇటువంటి అభివృద్ధి పనులను నిలిపివేయడం సరికాదని ఈ విషయం మీడియా ద్వారా స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వరకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## వికలాంగుడి సైకిల్ యాత్రకు స్పందించిన ఎస్పీ జి. బిందు మాధవ్



**కాకినాడ, పెన్ పవర్, మార్చి 31:**కాకినాడ జిల్లా పోలీస్ అధికారి జి.బిందుమాధవ్ మానవత్వాన్ని చాటుతూ వికలాంగుడి సైకిల్ యాత్రను గమనించి అతన్ని ఆపి పరామర్శించారు.ఈరోజు సర్పవరం పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరా నిఘా వ్యవస్థను ప్రారంభించిన అనంతరం తిరిగి వెళ్తుండగా,పోలీస్ స్టేషన్ ఎదురుగా ఇచ్చాపురం నుంచి తిరుమలకు మూడు చక్రాల సైకిల్‌పై యాత్ర చేస్తున్న వికలాంగుడిని గమనించారు. వెంటనే వాహనం ఆపి అతని వద్దకు వెళ్లి బాగోగులు అడిగి మాట్లాడారు.అతనికి ఏవైనా అవసరాలు ఉన్నాయా అని అడిగి, అవసరమైన సహాయం అందించాలని సర్పవరం ఇన్‌స్పెక్టర్ బి. పెద్దిరాజుకు సూచించారు. ఎస్పీ గారు స్వయంగా ఆగి మాట్లాడడంతో ఆ యాత్రికుడు ఎంతో ఆనందం వ్యక్తం చేశాడు.అక్కడే ఉన్న స్థానికులు కూడా ఈ దృశ్యాన్ని గమనించి యాత్రికుడితో మాట్లాడగా,ఎస్పీ ఆప్యాయతకు అతను కొద్ది సేపు భావోద్వేగానికి గురయ్యాడు.

## ఎస్ తిమ్మాపురం పంచాయతీ పాలకవర్గ సభ్యులకు ఘనంగా సన్మానం.



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 31:**కిర్లంపూడి మండలం ఎస్ తిమ్మాపురం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు మంగళవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.. సర్పంచ్ మందేటి వీరలక్ష్మి పెద్దిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో ఉప సర్పంచ్ నేలపాటి వెంకటలక్ష్మి తో సహా వార్డు సభ్యులు అందరికి శాలువా కపి పూలమాలలతో మెమొంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఏప్రియల్ 2 తో సర్పంచ్ లు పదవీకాలం ముగియ నుండడంతో ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాల పాటు సహకరించిన పాలకవర్గ సభ్యులకు, గ్రామస్తులకు ఈ సందర్భంగా సర్పంచ్ మందేటి వీరలక్ష్మి పెద్దిరాజు కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో నామసాని తాసు,కానూరి కాసులు, సోము పెద్ద,గొడే బాల, ఓలేటి రాజేశ్వరరావు,ఉమ్మిడి నాగ దొర,వనపర్తి వీరభద్రరావు, రాసన బోయిన శ్యామ్, నక్కా సత్యనారాయణ,నాగోజు శివ, గొల్లపల్లి చక్రధర్,మందేటి ముంగర్లయ్య ,పురం హరీష్, గండికోట నాగేశ్వరరావు, మందేటి డేవిడ్ రాజు,గుద్దాటి అబ్బాయి,సిహెచ్ చిన్న, లష్కరుగండికోట అప్పన జలసూత్రపు వెంకన్న,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## శ్రీ ప్రతిభ విద్యాలయ విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు.

- విద్యార్థులను అభినందించిన విద్యాలయం అధినేత దాసం శేషరావు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 31**:ప్రత్తిపాడు మండలం ధర్మవరం శ్రీ ప్రతిభ విద్యాలయ విద్యార్థులు అంతర్జాతీయ గుర్తింపు సాధించారు. ఈ సందర్భంగా శ్రీ ప్రతిభ విద్యాలయం అధినేత దాసం శేషారావు మాట్లాడుతూ సిల్వర్‌జోన్ లో నిర్వహించిన అంతర్జాతీయ ఒలింపియాడ్ పరీక్షల్లో దేశవ్యాప్తంగా సుమారు 30 వేల పాఠశాలలు పాల్గొనగా, దాదాపు 1 కోటి 80 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

ఈ పోటీల్లో తమ పాఠశాల నుండి మొత్తం 83 మంది విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని చెప్పారు.ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆఫ్ సైన్స్‌లో 3 గోల్డ్ మెడల్స్,

ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆఫ్ మాథమెటిక్స్‌లో 2 గోల్డ్ మెడల్స్,ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో 1 గోల్డ్ మెడల్ సాధించి మొత్తం 6 గోల్డ్ మెడల్స్ గెలుచుకున్నారని తెలిపారు.మాథ్స్, సైన్స్ మరియు ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లలో కలిపి 7 సిల్వర్ మెడల్స్ తోపాటు 4 బ్రోంజ్ మెడల్స్ సాధించి మొత్తం 17 మెడల్స్ గెలుచుకొని పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విజేతలందరికీ మెడల్స్ తోపాటు సర్టిఫికేట్స్ అందజేసి వారికి శుభాకాంక్షలు తెలియజేసి, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారంతోపాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంవల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏవో నాగేశ్వరరావు, హెచ్.ఎం. సత్యనారాయణ,లీడ్ఏసీ ఎమ్. రాణి, ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు జె.వి. స్వామి, పి. విమల, ఎ. శ్రీనివాస్,నూకరాజు, తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బడుగువానిలంకలో అయ్యప్ప స్వామి "ఆరాట్టు" వేడుకలకు సర్వసిద్ధం





### కేరళ తరహాలో భారీ ఏర్పాట్లు

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 31;**అయ్యప్ప స్వామికి కేరళలో నిర్వహించే ఆరాట్టు కార్యక్రమం మాదిరిగానే గోదావరి జిల్లాల్లో తొలిసారిగా అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంక గోదావరి చెంతన నిర్వహించనున్నారు.ఆరాట్టు అంటే స్వామి వారి విగ్రహాన్ని నదిలో శుద్ధి చేసే మహిమానిత్వ కార్యక్రమం. అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్ళి పంబలో ఈ ఆరాట్టు కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. అదే తరహాలో బడుగువానిలంక చెంత నున్న గౌతమి నదిలో ఈ ఆరాట్టు నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి కడియం కు చెందిన తాడాల వీర వెంకటరావు గురుస్వామి ఆధ్వర్యంలో విస్సు మాల ధరించిన అయ్యప్ప స్వామి భక్త బృందం ఈ ఆరాట్టు నిర్వహిస్తారు.108 కళాశాలతో గ్రామం నుండి ఊరేగింపుగా గోదావరి చెంతకు చేరుకుని ఈ కార్యక్రమాన్ని చేపడతారు. ఇప్పటివరకు రాష్ట్రంలో అయ్యప్ప స్వామి మండల దీక్షలు, జ్యోతి దర్శన దీక్షలు వంటివి మాత్రమే ఎక్కువగా అయ్యప్ప స్వాములు చేపడతారు. కాని ఈ ఆరాట్టు నిర్వహించడానికి విస్సు మాలాధారణ 30 మంది భక్తులు చేపట్టారు. బడుగువానిలంక గ్రామానికి చెందిన పడాల వెంకటేశ్వరరావు గురుస్వామి పర్యవేక్షణలో లంక గ్రామాల చెందిన భక్తులు ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు.భక్తులు విరాళంగా ఇచ్చిన లక్షలాది రూపాయల వ్యయంతో భారీ ఏర్పాట్లు చేశారు.ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం వేలాది మందికి అన్న సమారాధన నిర్వహిస్తారు. అలాగే బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి ఉత్తరా నక్షత్ర జన్మదిన వేడుకలను కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అయిదు సంవత్సరం నుంచి ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. పాతూరు రామాలయం వద్ద అయ్యప్ప స్వామి వారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, అనేక రకాల పండ్ల రసాలతో అభిషేకాలు జరుపుతారు. ఎంతో కన్నుల పండువగా జరిగే ఈ వేడుకలు తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు.

## పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్ డిస్పెన్సర్ వితరణ




- ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ 'న్యూ జన్ క్వీన్స్' సేవానిరతి
- రూ. 10 వేల విలువైన పరికరం అందజేత

**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 31** : సేవే పరమావధిగా ఆపన్నులకు అండగా నిలవడమే ధ్యేయంగా పనిచేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ న్యూ జన్ క్వీన్స్ (పెద్దాపురం) సభ్యులు మరోసారి తమ ఉదారతను చాటుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని బాలింతల అవసరాలను గుర్తించి వారికి నిరంతరం శుద్ధి చేసిన వేడి, చల్లని నీరు అందించే లక్ష్యంతో రూ. 10 వేలు విలువైన హాట్ అండ్ కోల్డ్ వాటర్ డిస్పెన్సర్ ను ఆసుపత్రి వర్గాలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా

ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. ఉమామహేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు స్వచ్ఛంద సంస్థలు అందించే ఇటువంటి సహకారం అభినందనీయమని, ఇది రోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. బాలింతల సౌకర్యార్థం హాట్ అండ్ కోల్డ్ వాటర్ డిస్పెన్సర్ ను ఆసుపత్రికి అందజేసిన క్లబ్ సభ్యులను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు పాలకుర్తి శ్రీకరి, కార్యదర్శి తాళ్లూరి మేఘన, సభ్యురాలు కంభంపాటి నవ్యశ్రీ, మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకుడు దేవత రాజేష్ కుమార్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాజ్ కుమార్, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఆర్. జగదాంబ ఐ.సి.టి.సి కౌన్సిలర్ బి. శ్రీనివాసరావు, స్టాఫ్ నర్స్ లోవరాణి, తదితరులు పాల్గొన్నారు.

## తొలి తిరుపతిలో కన్నులపండువగా సామూహిక కుంకుమ పూజలు



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 31** : పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువైన శ్రీ శృంగారవల్లభ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవములు అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన "ఉచిత సామూహిక లలితా కుంకుమార్చన భక్తిప్రపత్తుల మధ్య మంగళప్రదంగా సాగింది. సుమారు 600 మంది మహిళలు ఈ సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల సౌకర్యార్థం పూజకు కావలసిన సమస్త పూజాద్రవ్యములను దేవస్థానం ఉచితంగా సమకూర్చినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం, ధర్మ రక్షణార్థం శ్రీస్వామి వారి సన్నిధిలో ఈ మహత్కార్యాన్ని తలపెట్టామని తెలిపారు. పూజానంతరం పాల్గొన్న ముత్తైదువులందరికీ ఆలయ మర్యాదలతో కూడిన అన్నప్రసాద వితరణ గావించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, ధర్మకర్తల మండలి చైర్మన్ మొయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, పాలకమండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మాజీ వైస్ ఎంపీపీ హత్య కేసులో సంచలన తీర్పు

### ముగ్గురికి యావజ్జీవ శిక్ష, జరిమానా

**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 31** : పెద్దాపురం మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ గోపు సతీష్ రాజా హత్య కేసులో న్యాయస్థానం సంచలన తీర్పునిచ్చింది. పాత కక్షల నేపథ్యంలో జరిగిన ఈ దారుణ హత్యకు కారకులైన ముగ్గురు నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా కం సెషన్స్ కోర్టు జడ్జి జి. చంద్రమౌళీశ్వరి తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే 2016, మే నెల 15వ తేదీ రాత్రి ఎనిమిది గంటల సమయంలో దివిలి గ్రామంలోని శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ షూమార్ట్ సమీపంలో ఈ ఘాతుకం చోటుచేసుకుంది. పాత కక్షల నేపథ్యంలో కొప్పిరెడ్డి అచ్చిరాజు, ఆయన కుమారులు రాంబాబు, రాజేష్ లతో కలిసి సతీష్ రాజాను అంతమొందించాలని పథకం వేశారు. పథకం ప్రకారం కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి అత్యంత నిర్దాక్షిణ్యంగా నరికి చంపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసి నిందితులను అరెస్టు చేశారు. న్యాయస్థానంలో వాద, ప్రతివాదనలు అనంతరం ప్రాసిక్యూషన్ తరపున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి.ఎం. జయరావు, గన్నంరాజు వినయతేజ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

## నేటితో గడువు పూర్తి




**మండపేట. పెన్ పవర్.మార్చ్ 31** :ఆస్తి పన్ను బకాయి దారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 50 శాతం వడ్డీ మాఫీ గడువు నేటితో ముగుస్తుందని కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఇంకా పన్నులు చెల్లించని ఇళ్ల వద్దకు వసూలు సిబ్బంది వెళ్లి, ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతూ మున్సిపల్ సిబ్బంది చేపట్టిన అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగారావు మాట్లాడుతూ ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు బకాయిలను ఒకేసారి చెల్లిస్తే మాత్రమే ఈ 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఈ ప్రత్యేక సదవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు రాత్రి 12 వరకూ పని చేస్తాయని తెలిపారు. ఈ ఏడాదికి ఇదే అవకాశం కావడంతో పన్ను బకాయిలు వెంటనే చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కోరారు.

## ఏడిద సీతానగరంలో ఘనంగా అంకాలమ్మ జాతర




**మండపేట. పెన్ పవర్.మార్చ్ 31** :మండలంలోని ఏడిద సీతానగరంలో వెలసిన అంకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారి ఆలయంలో హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి, పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. రాత్రి జాగారం నిర్వహించనుండగా, బుధవారం తీర్థ మహోత్సవం జరగనుంది. ఏడిద, సావరం పరిసర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లా వీరబాబు, సర్పంచ్ వరదా చక్రవర్తి, గ్రామ అధ్యక్షుడు వేగిరాజు గోపాలకృష్ణ, గ్రామస్తులు ఆకుల పుల్లయ్య, చేకూరి వెంకటరాజు, అడ్డాల చిన్న, మేడిద దొరబ్బాయి, ఆకుల రామకృష్ణ, రావూరి చిన్న కాపు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# వాడపల్లి వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం







**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 31:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో జరుగుతున్న వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగ వ రోజు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.
వేకువజామున మేలుకొలుపు సేవతో ప్రారంభమైన కార్యక్రమాల్లో తీర్థ బిందె తెచ్చుట, విశేషార్చన, నిత్యహోమం, బలిహరణం, ద్రవిడ వేదపారాయణం, నీరాజన మంత్రపుష్పములు నిర్వహించారు. మధ్యాహ్నం విష్వక్సేన పూజ, అష్టదిక్పాలక ఆరాధన ఘనంగా నిర్వహించారు. అనంతరం సదస్యం నిర్వహించి, శ్రీ స్వామి వారికి చతుర్వేద పండితులచే మహాదాశీర్వచనం అందించారు.
తర్వాత నీరాజన మంత్రపుష్పములు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి సభ్యులు తమ్మన సాయి ప్రసాద్, సిస్ట కుటుంబరావు, చలుమూరి రాంబాబు, వాడపల్లి సుందర శేషావతారం, ఆలయ సిబ్బంది, అర్చక స్వాములు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆకివీడు ఘటనలు ఆందోళనకరం



**మండపేట. పెన్ పవర్. మార్చి 31 :** రాష్ట్రంలో శాంతి, సామరస్యాలకు భంగం కలిగించే సంఘటనలు వరుసగా చోటుచేసుకోవడం అత్యంత ఆందోళనకరమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్ అన్నారు. మంగళవాం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు వ్యవహారం ఆకివీడు ప్రాంతంలో ఉద్రిక్తతలకు దారితీసిందన్నారు. ఆకివీడు పెదపేట ఎస్సీ కాలనీలో జరిగిన ఘర్షణలు యాదృచ్ఛికం కాదని, ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. బయట ప్రాంతాల నుంచి అనుచరులను సమీకరించి, పోలీసుల సహకారంతో వివాదాస్పద ప్రాంతానికి వెళ్లడం, స్థానిక దళితులను రెచ్చగొట్టడం వంటి చర్యలు పూర్తిగా అనుచితమని విమర్శించారు. వివాదంలో ఉన్న దేవస్థానం వద్దకు వెళ్లి రామాలయం కట్టితీరుతాం అంటూ సవాళ్లు విసరడం పరిస్థితులను మరింత విషమం చేసిందన్నారు. ప్రజాప్రతినిధులు ఇలాంటి చర్యలకు పాల్పడటం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని, వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. దాడికి గురైన దళితులపైనే కేసులు నమోదు చేసి, దాడి చేసిన వారిపై సరైన చర్యలు తీసుకోకపోవడం న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే అంశమని అన్నారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, అప్పటివరకు కేసులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులపై వేధింపులు, నిర్బంధాలు ఆగాలని, ఎస్సీ కాలనీల్లో భయాందోళనలు సృష్టించడం మంచి పద్ధతి కాదన్నారు. దీనికి కారకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రముఖులను కలిసిన ఏపీడబ్ల్యూజేఎఫ్ - ఏపీబీజేఏ సంఘ ప్రతినిధులు







**కొత్తపేట, పెన్ పవర్, మార్చి31;**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జర్నలిస్టుల సంఘాలైన ఏపీడబ్ల్యూజేఎఫ్ , ఏపీబీజేఏ నూతన కార్యవర్గానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ,మాజీ పార్లమెంట్ సభ్యురాలు చింత అనురాధ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. శాసనమండలి సభ్యుడిగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను మండలిలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తానని బొమ్మి ఇజ్రాయిల్ హామీ ఇచ్చారు. ఇదే సందర్భంగా సంఘ ప్రతినిధులు జిల్లా ఎస్పీ రాహుల్ మీనాను మర్యాదపూర్వకంగా కలిసి సంఘం తరఫున షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు ప్రశంసనీయమని అధికారులు అభినందించినారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు మట్టపర్తి శ్రీనివాస్, కార్యదర్శి వాకాడ బాబులు, ఏపీబీజేఏ అధ్యక్షులు కడలి రాజు, ప్రధాన కార్యదర్శి పరమట భీమా మహేష్, కడలి సూరిబాబు, కమిటీ సభ్యులు దిడ్ల మోహన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దంగేటి వెంకటేశ్వరరావు, అద్దంకి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యత మరింత బలోపేతం కావాలని,వారి హక్కుల పరిరక్షణతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలుపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలవడం ద్వారా జర్నలిస్టుల సమస్యలను పరిచయం చేయడం,వారి అభ్యున్నతికి సహకారం అందించేందుకు ఈ చర్యలు దోహదపడతాయని తెలిపారు.

## సింహాద్రిపురం గ్రామంలో కుష్టి వ్యాధి నిర్మూలనపై స్క్రీనింగ్ కార్యక్రమం.





**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 31:**కిర్లంపూడి మండలం
సింహాద్రిపురం గ్రామంలో మంగళవారం కుష్టి వ్యాధి నిర్మూలనపై స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్, బి రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో చేపట్టారు. కాకినాడ డిఎం అండ్ హెచ్ ఓ ఆఫీస్ నుండి కుష్ఠు వ్యాధి విభాగం నుండి డిపిఎంఓ లక్ష్మణరావు,జి అప్పలరాజు, ఎల్ వివి ఎ స్ శ్రీనివాసరావు డాక్టర్ భరత్ విచ్చేశారు. సింహాద్రిపురం గ్రామంలో సుమారు 3000 మంది జనాభాకు గాను 20 మంది వైద్య బృందాలు మూడు టిమ్ లు గాఏర్పడి కుష్టి వ్యాధి మచ్చలను గుర్తించేందుకు స్క్రీనింగ్ వైద్య పరీక్షలు గ్రామస్తులకు నిర్వహించారు. కృషి వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి సాయి హేమాంజలి పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అండర్ -9 చదరంగం పోటీలకు ఎంపిక

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 31:**మాస్టర్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఆంగ్లో ఇండియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ అండర్ -9 బాల బాలికల విభాగాల వారిగా చదరంగం జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు ఉదయం 10 గంటలకు గంటలు ప్రారంభమైనవి ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి సుమారు 20 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మరియు ఈ పోటీలకు స్పాన్సర్ గా వహించిన ఆంగ్లో ఇండియన్స్ స్కూల్ డైరెక్టర్ రాకేష్ విజేతలకు మెమెంటాస్ ప్రశంస పత్రాలు అందజేశారు అనంతరం కార్యక్రమంలో వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ కమిటీ కన్వీనర్ ఎస్ చంద్రశేఖర్ కమిటీ మెంబర్స్ ఎల్ అరవింద్ బాబు జె రాంబాబు చీఫ్ ఆర్బిటర్ వై.డి ప్రసాద్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి రెండు స్థానాలు గెలుపొందిన క్రీడాకారులు జూన్ నెల తూర్పుగోదావరి జిల్లాలో జరుగు రాష్ట్రస్థాయి అండర్ -9 చదరంగం పోటీలకు మన జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని ఎస్.ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. విజేతల వివరాలు మొదటి స్థానం బాలుర విభాగంలో తాడేపల్లిగూడెం చెందిన కే ఏసీల్ ద్వితీయ స్థానం నల్లజర్ల కింగ్స్ వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్ చెందిన దాపత్తి ఆరుష బాలికల విభాగంలో భీమవరం చెందిన బి .అశ్విత వర్మ ద్వితీయ స్థానం తాడేపల్లిగూడెం చెందిన సి. జోష్నికా మన జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు.

## కృష్ణవరంలో సిరి సూపర్ 66 వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు.



**కిర్లంపూడి,పెన్ పవర్,మార్చి 31:** కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో సిరి సూపర్ 66 వరి పొలాలను శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. సిరి కంపెనీ సూపర్ 66 రకం వరి విత్తనాలు ఈనిక దశలో సరైన పాలు పోసుకోకపోవడంతో రైతులు ఫిర్యాదు మేరకు పొల్లు వచ్చిన వరి పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. శాస్త్రవేత్తలు జె.సుధీర్ కుమార్, డాక్టర్ ఎం రామభద్రరాజు, డాక్టర్ ఏ ఎస్ ఆర్ శర్మ పెద్దాపురం వ్యవసాయ శాఖ ఏ డి ఏ,ఎన్ దైవకుమార్ కలసి పొల్లు వచ్చిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొల్లు శాతం ఎంత వచ్చిందో పరిశీలించడం జరిగిందన్నారు. శాస్త్రవేత్తలు ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏ డి ఏ,ఎన్ దైవకుమార్ ఈ సందర్భంగా రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి, మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి ఆకుల సురేష్, గ్రామ వ్యవసాయ శాఖ అధికారి లింగేశ్వర్, సిరి కంపెనీ సేల్స్ ఆఫీసర్ ప్రసాద్, ప్రత్తిపాడు డీలర్,సుబ్బారావు, రైతులు పాతంశెట్టి తమ్మారావు పలువురు రైతులు పాల్గొన్నారు.

# కొంత నిరాశ ఉంది.. కానీ, బీసీసీఐ తీసుకున్న నిర్ణయం సరైనదే: గంగూలీ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్–ఆస్ట్రేలియా మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీస్ (బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీ) వేదికల ఎంపికపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ స్పందించారు. ఈడెన్ గార్డెన్స్‌లో టెస్టు మ్యాచ్ జరగకపోవడం పట్ల బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనకు కొంత నిరాశ ఉన్నప్పటికీ, బోర్డు తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆయన అభిప్రాయపడ్డారు."ఒక మాజీ క్రికెటర్‌గా కోల్‌కతాలో మ్యాచ్ జరగాలని నేను కోరుకుంటాను. కానీ, కేవలం సంప్రదాయ వేదికలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ఇతర మైదానాలకూ అవకాశం ఇవ్వడం ముఖ్యం" అని గంగూలీ అన్నారు. గువాహటి, రాంచీ వంటి నగరాల్లో టెస్టులు నిర్వహించడం వల్ల అక్కడి అభిమానులకు మేలు జరుగుతుందని, ప్రస్తుతం దేశంలోని అన్ని స్టేడియాల్లోనూ ప్రపంచ స్థాయి సదుపాయాలు ఉన్నాయని ఆయన చెప్పారు. 2001లో ఈడెన్ గార్డెన్స్‌లో ఆస్ట్రేలియాపై సాధించిన చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకున్న దాదా, ఆనాటి ఆటగాళ్లంతా మళ్లీ ఒక చోట చేరాలని ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించారు. "మేమంతా ఈ నెలలోనే కలవాల్సి ఉంది. అయితే సచిన్ టెండూల్కర్ కుమారుడి (అర్జున్ టెండూల్కర్) వివాహం ఉండటంతో ఆ భేటీని వాయిదా వేశాం. త్వరలోనే ఆ వేడుక ఎప్పుడనేది ప్రకటిస్తాం" అని ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తన కెరీర్‌లో లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పిన నాట్‌వెస్ట్ ట్రోఫీ విజయం కంటే.. కోల్‌కతా, అడిలైడ్, హెడింగ్లేలలో సాధించిన టెస్టు విజయాలే తనకు ఎక్కువ సంతృప్తినిస్తాయని గంగూలీ చెప్పారు. పాకిస్థాన్ తో జరిగిన టెస్టులో సెహ్వాగ్ ట్రిపుల్ సెంచరీ గురించి చెబుతూ... "300 పరుగుల దగ్గర సింగిల్ తీయమని నేను చెప్పినా వినకుండా, వీరూ సిక్స్‌తోనే దాన్ని పూర్తి చేశాడు. త్రిశతకాలు తరచూ రావు, అందుకే అప్పుడు నేను కాస్త కంగారు పడ్డాను" అని నవ్వుతూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం బీసీసీఐ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్‌లు బోర్డర్–గావస్కర్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

# ధోనీ నా ఫోన్ లిఫ్ట్ చేయడు.. ఆయనకు నాకు మాటలు లేవు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ మధ్యలో చెన్నై సూపర్ కింగ్స్ కొత్త, పాత ప్లేయర్స్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక రీయూనియన్ క్యాంపెయిన్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఈ వేడుకలో జట్టులోని దాదాపు అందరూ స్టార్ ఆటగాళ్లు కనిపించగా, జడేజా, ధోనీ ఒకరితో ఒకరు మాట్లాడుకోకపోవడం కెమెరాలలో రికార్డు అయింది. దీంతో వీరిద్దరి మధ్య కోల్డ్ వార్ స్టార్ట్ అయిందా అనే ప్రచారం మొదలయింది. ప్రస్తుతం నెట్టింట ఈ గొడవ తెగ ట్రెండింగ్ అవుతుంది. ఈక్రమంలో ఈ వివాదంపై రవీంద్ర జడేజా మాట్లాడుతూ.. అది కేవలం టెక్నికల్ ఎర్రర్ తప్ప మనస్పర్థలు లేవని స్పష్టం చేయడంతో క్రికెట్ అభిమానులు ఊపరి పీల్చుకున్నారు.







జడేజా మాట్లాడుతూ.. నేను రీయూనియన్‌కు వెళ్లే ముందే 'మహీ భాయ్'కి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నారో అడుగుదామని అనుకున్నా.. కానీ ఆయన ఫోన్ స్విచాఫ్‌లో ఉండటంతో.. వేడుక జరిగే ప్రదేశంలో కూడా చాలా రద్దీగా ఉండటంతో మేమిద్దరం మాట్లాడుకునే ఛాన్స్ రాలేదన్నారు. అంతే తప్ప మా మధ్య ఎలాంటి గొడవలు లేవని నవ్వుతూ ఆన్సర్ ఇచ్చాడు. ధోనీకి ఫోన్ చేయడం కంటే అతడ్ని నేరుగా కలవడమే ఈజీ, ఎందుకంటే ఆయన ఎప్పుడు ఫోన్ వాడుతారో ఎవరికీ తెలియదని రవీంద్ర జడేజా ఫన్నీ కామెంట్స్ చేశాడు. 2022 ఐపీఎల్ సమయంలో కెప్టెన్సీ మార్పుతో జడేజా, ధోనీ మధ్య గొడవలు వచ్చాయని ప్రచారం జరిగింది. కానీ 2023 ఫైనల్‌లో జడేజా ఆఖరి బంతికి ఫోర్ కొట్టి సీఎస్కేని విజేతగా నిలిపిన తర్వాత ధోనీ అతడిని ఎత్తుకుని సెలబ్రేషన్స్ చేసుకోవడంతో ఆ వార్తలకు బ్రేక్ పడింది. ఇప్పుడు మళ్ళీ ఇలాంటి చిన్న చిన్న విషయాలను పెద్దవి చేయవద్దని జడేజా ఫ్యాన్స్ ని కోరాడు. ధోనీ తనకు ఎప్పుడూ గురువు, మార్గదర్శి.. అతనిపై ఉన్న గౌరవాన్ని ఎప్పటికీ తగ్గించనని జడ్డూ తేల్చి చెప్పారు. ఈ రీయూనియన్ వివాదంపై జడేజా క్లారిటీ ఇవ్వడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పాక్ క్రికెటర్లకు కొత్త రూల్.. రాజకీయ పోస్టులు పెడితే కోటి ఫైన్!




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ నసీం షాకు ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) భారీ జరిమానా విధించింది. పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్‌పై సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్ట్ చేసినందుకు గానూ అతడికి 72,000 అమెరికన్ డాలర్లు (పాకిస్థాన్ కరెన్సీలో సుమారు రూ. 2 కోట్లు) ఫైన్ వేసింది. ఈ ఘటన నేపథ్యంలో, కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లందరికీ పీసీబీ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇకపై రాజకీయపరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే... ఇటీవల పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 ప్రారంభ మ్యాచ్‌కు పంజాబ్ సీఎం మరియం నవాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె, ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ కు కూతురు వరుస అవుతుంది. అయితే, నసీం షా సోషల్ మీడియాలో "గడాఫీ స్టేడియంలో ఆమెకు రాణికి ఇచ్చినంత గౌరవం ఎందుకు ఇస్తున్నారు?" అని వ్యంగ్యంగా పోస్ట్ చేశాడు. గల్ఫ్ యుద్ధం కారణంగా దేశంలో నెలకొన్న సంక్షోభం దృష్ట్యా ప్రభుత్వ పొదుపు చర్యల్లో భాగంగా అభిమానులను స్టేడియాల్లోకి అనుమతించని సమయంలో ఒక రాజకీయ నాయకురాలికి ఇంతటి ప్రాధాన్యత ఇవ్వడంపై ఈ పోస్ట్ దుమారం రేపింది. ఈ పోస్ట్‌ను వెంటనే తొలగించి, తన ఖాతా హ్యాక్ అయిందని నసీం షా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశాడు. అయితే, ఈ వాదనను పీసీబీ అంగీకరించలేదు. ఈ నెల 27న అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణ చేపట్టింది. క్రమశిక్షణ కమిటీ విచారణ అనంతరం సెంట్రల్ కాంట్రాక్ట్ నిబంధనలను, సోషల్ మీడియా మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు తేల్చి రూ. 2 కోట్ల జరిమానా విధించింది. నసీం షా బేషరతుగా క్షమాపణ చెప్పినట్లు బోర్డు తెలిపింది. ఈ ఘటనకు బాధ్యుడిగా అతడి సోషల్ మీడియా సలహాదారుడిని కూడా విధుల నుంచి తొలగించి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ఈ నేపథ్యంలో ఆటగాళ్ల సోషల్ మీడియా వినియోగంపై పీసీబీ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. జియో న్యూస్ కథనం ప్రకారం.. ఇకపై బోర్డు మీడియా విభాగం నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి రాజకీయపరమైన పోస్టులు పెట్టరాదని ఆటగాళ్లకు, వారి మేనేజర్లకు స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కనీసం కోటి రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. రాజకీయ పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బోర్డు స్పష్టం చేసింది.

# వారణాసి సినిమాపై ఇంట్రెస్టింగ్ అప్ డేట్!





సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా –వారణాసి– తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. చిత్రీకరణ మొదలైన నాటి నుంచి రాజమౌళి అండ్ కో ఎక్కడా గ్యాప్ తీసుకోకుండా పని చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ముందుగా ప్రకటించిన సమయానికే రిలీజ్ చేయాలని కట్టుబడి టీమ్ పని చేస్తోంది. ఈనేపథ్యంలో సినిమాకు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్ డేట్ ఒకటి వెలుగులోకి వచ్చింది. మహేష్ తన పార్ట్ షూటింగ్ ను సెప్టెంబర్ లేదా? అక్టోబర్ కల్లా పూర్తి చేస్తారని తెలిసింది. అనంతరం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పనులు మొదలు పెట్టాలని ప్లాన్ చేసుకుంటున్నారుట.సాధారణంగా రాజమౌళి సినిమాలంటే షూటింగ్ పూర్తి చేయడానికి సమయం తీసుకుంటారు. కానీ –వారణాసి– విషయంలో మాత్రం జక్కన్న పక్కా ప్లానింగ్‌తో షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తున్నారు. ఓవైపు మహేష్ పై సన్నివేశ్శాలు చిత్రీకరిస్తుండగా మరోవైపు ఇతర పాత్రలకు సంబంధించిన షూటింగ్ కూడా ఏక కాలంలో జరుగుతోంది. కీలక షూట్ లో రాజమౌళి ఉండగా , మిగతా పార్ట్ కు సంబంధించిన షూట్ లో ఆయన టీమ్ పని చేస్తోంది. హీరోపై సన్ని వేశాల చిత్రీకరణ పూర్తయిందంటే మెజార్టీ పార్ట్ షూటింగ్ మొత్తం పూర్తయినట్లే.అప్పటి నుంచి షూటింగ్ పరంగా పెద్దగా ఫోకస్ చేయాల్సిన పని తగ్గుతుంది. సెట్ లో రాజమౌళి ఉన్నా? లేకపోయినా ఆయన టీమ్ మిగతా పనుల్ని సునాయాసంగా పూర్తి చేస్తుంది. అలాగే రాజమౌళి ప్రతి సినిమాకు విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక విభాగాలకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. అయితే –వారణాసి– విషయంలో షూటింగ్‌తో పాటు సమాంతరంగా సాంకేతిక పనులను కూడా పూర్తి చేసేలా టీమ్ ప్లాన్ చేస్తోంది. మహేష్ బాబు షూటింగ్ పూర్తి చేసిన తర్వాత సినిమాను పూర్తి స్థాయిలో ఆవిష్కరించేందుకు కావాల్సిన సమయాన్ని రాజమౌళి తెలివిగా సద్వినియోగం చేసుకుంటారు.

ఇలా చేయడం వల్ల –వారణాసి– అనుకున్న సమయానికి విడుదల కావడానికి ఎంతో దోహదపడుతుంది. ఈ చిత్రాన్ని గ్లోబల్ స్థాయిలో రిలీజ్ ప్లాన్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ఏకంగా 120 దేశాల్లో రిలీజ్ చేస్తున్నారు. ఒకేసారి ఇన్ని దేశాల్లో రిలీజ్ చేయడం అన్నది చిన్న టాస్క్ కాదు. రిలీజ్ కు సంబంధించి గ్లోబల్ స్థాయిలో పెద్ద పెద్ద ఏజెన్సీలు, పంపిణీ సంస్థలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. అందుకు కూడా సమయం ఎక్కువగానే పడుతుంది. అయితే రాజమౌళి లాంటి లెజెండ్ కు అదేం పెద్ద పని కాదు. ఆస్కార్ తో అంతర్జాతీయంగా తనకున్న గుర్తింపుతో అనుకున్న గొప్పగా పాన్ వరల్డ్ లో రిలీజ్ చేస్తారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com